క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రొద్దుటూరు : మెయింటెనెన్స్ పనుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రొద్దుటూరు నియోజకవర్గం పరిధిలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జి.శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఇందుకు సహకరించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బద్వేలు అర్బన్ : 132/33 కె.వి.సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ ఐ.రవిచంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి అంతరాయానికి సహకరించాలని కోరారు.

12 నుంచి అవగాహన తరగతులు

ప్రొద్దుటూరు : ఈనెల 12 నుంచి 24వ తేదీ వరకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ విద్య, ఉన్నత ఉపాధి అవకాశాలు, ప్రాముఖ్యతపై ఉచిత అవగాహన తరగతులను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీసీహెచ్ జగదీశ్వరుడు ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ 2023 రిజిస్టర్ అయి, సర్టిఫికెట్లను వెరిఫై చేయించుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులు ఈ అవగాహన తరగతుల్లో పాల్గొనవచ్చునని ఆయన పేర్కొన్నారు.

ఇండియన్ బ్యాంకు నూతన బ్రాంచ్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎ.గణేశరామన్

ప్రొద్దుటూరు : స్థానిక మైదుకూరు రోడ్డులోని ఎన్జీఓ కాలనీ లక్ష్మీనగర్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ బ్యాంకు బ్రాంచ్‌ను ఇండియన్ బ్యాంకు హైదరాబాద్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ ఎ.గణేశరామన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు మరిన్ని మెరుగైన డిజిటల్ సేవలను అత్యంత వేగంగా అందించేందుకు ఈ బ్రాంచ్‌ను ప్రారంభించామని తెలిపారు. ఇండియన్ బ్యాంకుకు దేశ వ్యాప్తంగా 5815 శాఖలు ఉన్నాయన్నారు. ఇండియన్ బ్యాంకు తిరుపతి జోనల్ మేనేజర్ ఎం.సెల్వరాజ్ మాట్లాడారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డి.ఆనందనాయక్, డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎం.రాజేష్, బ్యాంకు మేనేజర్ బి.హరిప్రసాద్, బ్యాంకు సిబ్బంది, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

ఓట్ల నమోదుపై అప్రమత్తంగా ఉండాలి

ప్రొద్దుటూరు : ఎన్నికల ఏడాది కావడంతో ఓట్ల నమోదుపై బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో శుక్రవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకోవాలన్నారు. ఓటర్లందరికీ ఆధార్ కార్డులను అనుసంధానం చేయడం జరిగిందన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ అజయ్ బాబు, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాడుతున్న వృషభాలు

కాశినాయన : మండలంలోని ఓబుళాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన దస్తగిరి స్వామి దర్గాలో శుక్రవారం గ్రామస్తులు గంధం, జెండా మహోత్సవం నిర్వహించారు. అనంతరం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన శివకృష్ణచౌదరికి చెందిన వృషభాలు మొదటి బహుమతి రూ.1,00,116లు, కాశినాయన మండలం ఆనంవారిపల్లె గ్రామానికి చెందిన శీలంజగన్‌మోహన్‌రెడ్డి వృషభాలు రెండవ బహుమతి రూ.70,116లు, ప్రకాశం జిల్లా జె.సి.అగ్రహారం గ్రామానికి చెందిన లక్క నాగశివశంకర్ వృషభాలు మూడవ బహుమతి రూ.60,116లు, వైఎస్సార్‌జిల్లా వీరప్పనాయునిపల్లె గ్రామానికి చెందిన చిట్టిబోయిన భరత్ కుమార్ వృషభాలు నాల్గవ బహుమతి రూ.30,116లను గెలుచుకున్నాయి. మిగిలిన మూడు జతల వృషభాలకు రూ.15,116, 10,116, రూ.10,116లు అందజేశారు. వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సంఘ సంస్కర్త విలియం కేరీ

కడప రూరల్: మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి చేసి సమాజంను మేల్కొలిపిన గొప్ప సంఘ సంస్కర్త డాక్టర్ విలియం కేరీ అని వరల్డ్ పీస్ అంబాసిడర్ ఆఫ్ క్రైస్ట్ డాక్టర్ బిషప్ కే సామ్యూల్‌బాబు కొనియాడారు. విలియం కేరీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడం అభినందనీయం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు



పాల్గొన్న కాంట్రాక్టు ఉద్యోగులు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 11వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. 20 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను సీఎం జగన్ పరిష్కరించారన్నారు. వైఎస్ కుటుంబానికి మేలు చేయడం మాత్రమే తెలుసునని అన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ అధికారంలోకి వచ్చాక లక్షా 30వేల మంది సచివాలయ ఉద్యోగులను నియమించారన్నారు. ప్రస్తుతం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి మరింత కీర్తింపబడుతున్నారని చెప్పారు. అంతకు ముందు ప్రభుత్వాలు ఎందుకు ఈ విధంగా ఆలోచించలేదో అర్థం కావడం లేదన్నారు. ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఒకే సంతకంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేసిందని తెలిపారు. ఎన్నో ఏళ్ల కాంట్రాక్టు కార్మికుల కల నెరవేర్చినందుకు ప్రభుత్వాన్ని అభినందించారు. చంద్రబాబు నాయుడు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా ఉపయోగం ఉండదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి మాత్రం సింగిల్‌గానే ఎన్నికల్లో పోటీ చేస్తారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగి ఆచారి మాట్లాడుతూ చరిత్రలో ఇదొక చారిత్రాత్మక నిర్ణయమని, సువర్ణ అక్షరాలతో లిఖించవచ్చన్నారు. చంద్రబాబు నాయుడు 2003 నుంచి కొత్తగా కాంట్రాక్టు విధానాన్ని అమలు చేశారని తెలిపారు. వైఎస్ఆర్ 2008లో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేశారన్నారు. తమ సమస్యను టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వైఎస్ తనయుడైన ముఖ్యమంత్రి జగన్ మళ్లీ సమస్యను పరిష్కరించినందుకు ఆయనకు పాదాభివందనం చేస్తున్నామన్నారు. ఏపీఎన్జీఓస్ అసోసియేషన్ మహిళా విభాగం నాయకురాలు జయమ్మ మాట్లాడుతూ 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేసిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ప్రమీల మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ, సర్పంచ్

పోరుమామిళ్ల : పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్ రెడ్డి తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. శుక్రవారం రంగసముద్రం పంచాయతీ మహబూబ్‌నగర్ ఎంపీపీ పాఠశాల పరిధిలో ఆయన బడిబాట కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. నాడు-నేడు కింద పాఠశాల సుందరీకరణ జరుగుతున్నదని, పిల్లలకు బెంచీలు, ప్యూరిఫైడ్ తాగునీరు సదుపాయాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఒడి, నాణ్యమైన భోజనం, వారానికి 5 రోజులు గుడ్లు, చిక్కీలు, రాగిజావ, మూడు జతల యూనిఫామ్, స్కూల్ బ్యాగ్, షూ, సాక్స్, బెల్ట్, టెస్ట్‌బుక్స్, నోట్స్ ఉచితంగా లభిస్తాయన్నారు. విశాలమైన ఆటస్థలం ఉందని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులున్నారన్నారు. నెలనెలా బ్రెయాన్స్ ఆసుపత్రి సిబ్బంది, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అనేక సదుపాయాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, ఎంపీటీసీ మహబూబ్‌పీర్, యువజన నాయకుడు గిరిప్రణీత్‌రెడ్డి, వార్డుమెంబర్ పీరయ్య, హెడ్మాస్టర్ రోశయ్య, ఉపాధ్యాయులు రాజానందరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ విజయ భారతి తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

ప్రొద్దుటూరు : జిల్లా నీటి యాజమాన్య సంస్థ, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తున్నట్లు ఏపీఓ జగదీశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు ఎకరాలు అంతకన్న తక్కువ భూమి, జాబ్ కార్డు ఉన్న రైతులకు ప్రభుత్వం మామిడి, చీని, సన్ననిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, అంజీర, డ్రాగన్ ఫ్రూట్, ఆపిల్‌బేర్ మొక్కలను సరఫరా చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మూడేళ్ల పాటు ఈ మొక్కలు సంరక్షణకు రైతులకు డబ్బు చెల్లించడం జరుగుతుందన్నారు. పొలం గట్లపైన టేకు, కొబ్బరి, సీతాఫలం, నేరేడు, మలబారు వేప, వెదురు మొక్కలను పెంచడం జరుగుతుందని వివరించారు. మునగ మొక్కల పెంపకానికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. వివరాలకు ఏపీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పీసీపల్లె వాసుల కల నెరవేరింది



సీసీరోడ్డు వేసిన దృశ్యం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని గొడ్లవీడు పంచాయతీ పీసీపల్లె లో ఉన్న ఆర్‌అండ్‌బీ గత కొన్ని ఏళ్లుగా దెబ్బతినడంతో వర్షం వస్తే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. బి.మఠం - బద్వేల్ రోడ్డు నుంచి గొడ్లవీడుకు ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. గుండాపురం, పీసీపల్లె, గొడ్లవీడుకు బస్సు సౌకర్యం కూడా ఉంది. గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు రోడ్డు కోసం గ్రామస్తులు మండల స్థాయి నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. గ్రామంలో వాహనాలు, పాదచారుల రద్దీ అధికంగా ఉంటుంది. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడటంతో వర్షం వస్తే వాహనాల తాకిడికి వర్షం నీరు ఇళ్ల లోపలికి వెళ్లడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. బి.మఠం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డిలు గ్రామంలో తప్పకుండా సీసీరోడ్డు కావాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పై ఒత్తిడి తెచ్చి ఆర్‌అండ్‌బీ నిధులు రూ.40లక్షలు మంజూరు చేయించడంతో స్థానిక సర్పంచ్, కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధారెడ్డిలు నిర్మాణ పనులు చేపట్టడంతో ఇప్పుడు సీసీ రోడ్డు ఏర్పాటైంది. దీంతో గ్రామస్తుల ఎన్నో ఏళ్ల ఎదురుచూస్తున్న రోడ్డు సౌకర్యం రావడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

వలంటీర్లు అంకితభావంతో పనిచేయాలి



వలంటీర్లకు నియామకపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : వలంటీర్లు అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరవేయాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డు సచివాలయాల పరిధిలో నూతనంగా నియమించబడిన వలంటీర్లకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ ప్రభుత్వానికి ఎంతో ఉపయోగకరంగా మారడంతో పాటు దేశంలోనే మన రాష్ట్రానికి మంచిపేరు తెచ్చిందన్నారు. రాబోవు రోజుల్లో వలంటీర్లకు ఆయా వార్డుల్లో ప్రత్యేక స్థానం, గౌరవం దక్కుతుందన్నారు. వలంటీర్లు కూడా మరింత అంకిత భావంతో పనిచేసి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, డీఈ సుమన్‌రెడ్డి, కౌన్సిలర్ సత్యనారాయణ, వార్డు ఇన్‌చార్జిలు చెన్నకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్‌కు సన్మానం

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని టీచర్స్ కాలనీలో పనిచేస్తున్న వలంటీర్ యాస్మిన్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో ప్రశంసలు అందుకుంటున్న యాస్మిన్‌కు బంగారు ఉంగరం, పట్టు చీర బహూకరించారు.

గర్భిణులు వైద్య సేవలను వినియోగించుకోవాలి




మాట్లాడుతున్న ఎంపీపీ లక్షుమయ్య

చాపాడు : గర్భిణుల కోసం ప్రతి నెలా పీహెచ్‌సీలో నిర్వహించే ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాలైన వసతులు ఉన్నాయని, గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సూచనలను తప్పక పాటించాలన్నారు. మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. ప్రతి నెలా గర్భిణుల కోసం దాతలు భోజనం ఏర్పాటు చేయాలని, దీని కోసం తనవంతు సహకారం అందిస్తారని తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లి బిడ్డ సంరక్షణ కార్డులో నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. రక్తహీనత లేకుండా వైద్యులు చెప్పిన సూచనలు, సలహాలు పాటించాలని గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ షమీమ్ భాను, జైనుల్లా దంపతులు భోజనం వసతిని ఏర్పాటు చేశారు. భోజన దాతలను ఎంపీపీ, వైద్య సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీవాణి, కావ్య మాధురి, సీహెచ్‌ఓ మహదేవ యాదవ్, ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు భాస్కర్, రమేష్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఇటీవలి భారీ గాలులకు దెబ్బతిన్న నీటిశుద్ధి పథకం పైకప్పును ఎంపీపీ పరిశీలించారు. మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పోరుమామిళ్ల : మండలంలోని కొర్రపాటిపల్లెలో నేడు శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డిలు పాల్గొంటారని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు.

గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ

ప్రొద్దుటూరు క్రైం : గర్భిణులకు ప్రభుత్వం అన్ని రకాల వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తోందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ తెలిపారు. స్థానిక శ్రీనివాసనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. ఆస్పత్రిలో గర్భిణులకు రక్తపరీక్షలు, స్కానింగ్, నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి డాక్టర్ దినేష్‌బాబు వివరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఎంసీపీ కార్డును పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సీఓ నాగజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

కామనూరు పీహెచ్‌సీలో..

కామనూరు పీహెచ్‌సీలో శుక్రవారం పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యాధికారి హనీఫ్‌బాబా ఆధ్వర్యంలో శ్రీకృష్ణ హాస్పిటల్ వైద్యురాలు సగిలి సుస్మిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో గర్భిణులకు ఉచితంగా భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు చంద్రకళ, బీవీవరప్రసాద్, ఫార్మసిస్టు శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ మధు, స్టాఫ్ నర్సులు విజయ, సుబ్బమ్మ, సీహెచ్‌ఓ మేర్సీ, ఆరోగ్య కార్యకర్తలు నాగ సుహాసిని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

దువ్వూరు : గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సమీర, రోషిణి పేర్కొన్నారు. మండల కేంద్రమైన దువ్వూరులో శుక్రవారం 72 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, ధనుర్వాతం రాకుండా టీటీ ఇంజక్షన్ వేయించుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

బద్వేలు అర్బన్ : గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సురేంద్రనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన ఆసుపత్రిలో జరుగుతున్న ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమం ద్వారా గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు అందిస్తూ తగు సూచనలు ఇవ్వాలని కోరారు. ప్రసవ సమయం ముందుగానే తెలియజేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మిలటరీ పట్టాల ప్లాట్లు సర్వే చేయాలి

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీలో సర్వే నెంబర్లు 1263, 1269/2లలో మంజూరు చేసిన ఇంటి పట్టాలను క్షుణ్ణంగా సర్వేచేయాలని సీపీఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ తహసీల్దారు గంగయ్యకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం సీపీఎం కార్యకర్తలతో కలసి ఆయన తహసీల్దారును మిలటరీ పట్టాలపై విచారణ జరపాలని కోరారు. 1999లో మాజీ జవాన్లకు ఒక్కొక్కరికి 5 సెంట్ల చొప్పున ఇంటి పట్టాలు పంపిణీ చేశారని, 2009లో తిరిగి ఆ పట్టాలను మార్చి మూడు సెంట్లకు కుదించి పంపిణీ చేశారన్నారు. అయితే అప్పుడు పట్టాలు పొందిన వారిలో చాలామంది ఇంతవరకు వాటి గురించి పట్టించుకోలేదన్నారు. అయితే కొంతమంది అందులో బోగస్ పట్టాలు సృష్టించారని భైరవ ప్రసాద్ ఆరోపించారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



రాజుపాళెంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

రాజుపాళెం : గ్రామాల్లో ఇప్పటికే పలు రకాల అభివృద్ధి పనులు చేశామని, ఇంకా అధికారులు, ప్రజా ప్రతినిధులు వీధుల్లో పర్యటించి సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. రాజుపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాలకు రూ.4.60 లక్షలతో 460 ఎల్ఈడీ వీధి లైట్లను ఎమ్మెల్యే తన సొంత నిధులతో కొనుగోలు చేసి అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో వీధి లైట్ల కొరత ఉండటంతో తన సొంత నిధులతో తీర్చామన్నారు. జగనన్న పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల అభిమానాన్ని పొందామన్నారు. ఇప్పటికే గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను నిర్మించామన్నారు. జగనన్న ఆశీస్సులతో, ప్రజల అభిమానం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఉన్న విధేయత, గ్రామ నాయకుల సహకారం తనను శాసనసభ్యుడిగా తిరిగి గెలిపిస్తారన్నారు. చంద్రబాబు, టీడీపీ నాయకులు చెప్పే అబద్ధాలు, మోసపూరిత మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వైఎస్సార్‌సీపీ భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందన్నారు. అంతకు ముందుగా ఎమ్మెల్యేకు ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, రాయలసీమ పోలీసు కంప్లైంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగేశ్వరరెడ్డి, ఎంపీడీఓ సయ్యదున్నీసా, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లే అర్హత మాకే ఉంది

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెప్పిన హామీలను అన్నింటిని నెరవేర్చిందని, రానున్న ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగే అర్హత, హక్కు తమకే ఉందని ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ తెలిపారు. శుక్రవారం పోరుమామిళ్ల మండలంలోని నాగలకుంట్లలో ఆమె గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని నాగలకుంట్ల, బీసీ కాలనీల్లో, ముసల్‌రెడ్డిపల్లె పంచాయతీ పరిధి ముసల్‌రెడ్డిపల్లె, కొత్తూరు దళితవాడల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, వాటి లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం నిరంతరం ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి పని చేస్తోందన్నారు. ఏ ఒక్క అర్హులు నష్టపోకుండా పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మరింత సమర్థవంతంగా పనిచేస్తామని, తమకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు నాగార్జునరెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, రంగసముద్రం సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెన్ను రాజశేఖర్, సర్పంచులు దస్తగిరి, సుబ్బయ్య, ఎంపీటీసీ రవికుమార్, నాయకులు డాక్టర్ మాబు, భాస్కర్‌రెడ్డి, గిరిప్రణీత్ రెడ్డి, చంద్రయ్య, బాలకొండారెడ్డి, వెంకటరెడ్డి, జయరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అశోక్‌కుమార్ రెడ్డి, ఖాసింపీరా తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

దువ్వూరు : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పోలీసు క్వార్టర్స్ మైదానంలో శుక్రవారం అసాంఘిక కార్యకలాపాల వల్ల జరిగే నష్టాలను ప్రజలకు వివరించారు. క్రికెట్ బెట్టింగ్, ఎర్రచందనం అక్రమ రవాణా, పేకాట తదితర జూదాలకు అలవాటు పడిన వ్యక్తుల జీవితాలు ఎలా ఉంటాయో ప్రజలకు వివరించారు. పోలీసు కళాజాత బృందంతో పరివర్తన, మేలుకొలుపు నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐ వరుణ్‌కుమార్, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.